క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీడీవోగా మరియదాసు



ఎంపీడీవోను అభినందిస్తున్న సిబ్బంది

పుల్లలచెరువు: ఇన్‌చార్జి ఎంపీడీవోగా మరియదాసును నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏవోగా పనిచేస్తున్న ఆయన.. ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యలు స్వీకరించారు. కార్యాలయం సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు ఎంపీడీవోకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ శ్రీనాథ్

పుల్లలచెరువు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనాథ్ అన్నారు. ఆయన శనివారం మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో డెంగీ, విషజ్వరాలు, వాంతులు, విరేచనాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వీటి బారిన పడకుండా ఉండొచ్చన్నారు. ఇళ్లలోని రుబ్బురోలు, టైర్లు, కొబ్బరి బొండాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. నీటి ట్యాంకులపై మూతలు పెట్టాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామాల్లో జ్వరంపై సర్వే చేస్తున్నారన్నారు. అవసరమైతే వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తారని స్పష్టం చేశారు. ప్రజలు తమ వంతు బాధ్యతగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం పాటు వేడి ఆహారం తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఎవరికైనా వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి లక్షణాలు కన్పిస్తే సమీపంలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలని డాక్టర్ శ్రీనాథ్ కోరారు.

రూ.6500 చెల్లిస్తే కుళాయి కనెక్షన్

దర్శి: తాగునీటి కుళాయిలు కావాల్సిన వారు రూ.6500 చెల్లిస్తే దర్శి నగర పంచాయతీ పరిధిలోని కనెక్షన్‌లు మంజూరు చేస్తామని నగర పంచాయతీ కమిషనర్ మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 15వ తేదీలోపు పట్టణంలో ఉన్న సాగర్ తాగునీటి కుళాయిలు, నిమ్మల బావి కుళాయిలు, అక్రమ కనెక్షన్ల క్రమబద్ధీకరణ చేసుకోవాలని, అలా చేసుకోకుంటే వాటిని తొలగిస్తామని కమిషనర్ హెచ్చరించారు. ప్రస్తుతం బజారులో ఉన్న పబ్లిక్ కుళాయిలను శాశ్వతంగా తొలగిస్తామని, షాపులకు 15 వేల రూపాయలు కట్టి కుళాయిలు క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ వివరించారు.

వాహనానికి ఇన్సూరెన్సు తప్పనిసరి



జరిమానా విధిస్తున్న జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్

కొండపి: వాహనదారుడు తప్పనిసరిగా ఇన్సూరెన్సు కలిగి ఉండాలని జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.ప్రకాష్ అన్నారు. కొండపిలో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారుడు వాహన పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. శనివారం నిర్వహించిన తనిఖీల్లో నాలుగు వాహనాలకు జరిమానా విధించారు. ఓవర్ లోడుతో వెళుతున్న వాహనానికి రూ.43 వేల జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయాలైన శ్రీహరిబాబు

టంగుటూరు: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం రాత్రి స్థానిక టోల్‌ప్లాజా సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామానికి చెందిన గడ్డం శ్రీహరిబాబు పనిపై టంగుటూరు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా టోల్‌ప్లాజా దాటిన తరువాత ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు.

లాభసాటిగా ఉల్లి నారు పెంపకం



పెద్దారవీడులో పెంపకంలో ఉల్లి నారు

పెద్దారవీడు: ఖరీఫ్‌లో ఉల్లి నారు పెంపకం లాభసాటిగా ఉండటంతో పెద్దారవీడు, సిద్ధినాయునిపల్లి గ్రామాల రైతులు ఆ వైపుగా దృష్టి సారించారు. ఈ ఏడాది ఉల్లి నారు పెంపకం విస్తీర్ణం పెరిగింది. ఉద్యాన పంటలో అతి సున్నిత పంట ఉల్లి. ఉల్లి నారు పెంపకంలో లాభసాటిగా ఉండటంతో ఆయా గ్రామాల రైతులు దాని సాగు ఎంచుకుంటున్నారు. నారు జాగ్రత్తగా కాపాడుకోవాల్సి ఉంటుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. నారు పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సకాలంలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి. గుంటూరు జిల్లా పెనుమాక, కాజా తదితర గ్రామాల రైతులు ఉల్లి విత్తనాలు తీసుకొచ్చి పెద్దారవీడు, సిద్ధినాయునిపల్లి గ్రామాల్లోని రైతుల పొలాల్లో నారు పెంపకం చేపడతారు. ఈ ప్రాంత పొలాల్లో ఉల్లి నారు పెంపకం చేపడితే దిగుబడులు అధికంగా వస్తాయని ఆ ప్రాంతం రైతులు తెలిపారు. విత్తనాలు కేజీ రూ.1800 నుంచి రూ. 2 వేల వరకు ధరలు పలికాయి. ఆ గ్రామాల్లో రైతులు దాదాపు 50 ఎకరాలు ఉల్లి నారు పెంపకం చేపట్టారు. రైతులు సొంతంగా ఉల్లి విత్తనాలు ఇచ్చి నారు పెంపకానికి ఎకరాకు రూ.1.25 లక్షలు ఇస్తారని, అందులో పెట్టుబడికి రూ.50 వేల ఖర్చులు వస్తాయని, రూ.75 వేల లాభం వస్తుందని రైతులు చెబుతున్నారు. అందుకే లాభసాటిగా ఉందని ఉల్లి నారు పెంపకంపై రైతులు దృష్టి సారించారు. ఉల్లికి తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. సకాలంలో తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేయాల్సి ఉంది. నారు పెంపకంలో నిర్లక్ష్యం చేస్తే మొక్క ఏపుగా పెరగదు. ఒకసారి నారుకు తెగుళ్లతో దెబ్బతింటే తేరుకోవడం కష్టం.

దీంతోనే ఉల్లి నారు పెంపకం చాలా జాగ్రత్తగా చేసుకోవాల్సి ఉంటుంది. రైతులు వ్యవసాయ బోర్ల కింద ఉల్లి పంటల సాగు చేస్తున్నారు. విత్తనాలు మొలకెత్తినప్పటి నుంచి నారు పీకేంత వరకు కలుపులు తీయాల్సి ఉంటుంది. నీటి తడులు వారానికోసారి, పది రోజులకోసారి ఎరువులు, రసాయన మందులు పిచికారీ చేయాల్సి ఉంటుందని, కూలీల ఖర్చు దాదాపు రూ.30 వేలు వస్తుందని రైతులు చెప్పారు. ఉల్లి సాగు చేసిన 12 రోజులకు మొలకెత్తుతుంది. అప్పటి నుంచి దాదాపు రెండు నెలల పాటు నారు పెంపకాన్ని కన్నబిడ్డల్లా చూసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత రైతులు నారు పీక్కొని వాహనాల్లో తీసుకెళ్తుంటారు. ప్రతి నాలుగు రోజులకోసారి నీటి తడులు ఇవ్వడం, ప్రతి వారానికోసారి పంటలో కలుపు తీసే పనులు చేపడతారు. అంతేగాక వారానికోసారి తెగుళ్ల సోకకుండా మందులు పిచికారీ చేస్తారు. వర్షాలు ఎక్కువగా కురిసినా నారు దెబ్బతినే ప్రమాదం ఉండటంతో వర్షం నీరు నారు మడుల్లో నిల్వ లేకుండా చూసుకుంటారు.

ఉల్లాసంగా గణనాథుల నిమజ్జనం



దొనకొండలో గణనాథుని నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు



కురిచేడులో నిమజ్జనానికి తరలిస్తున్న గణనాథుడు



పెద్దదోర్నాల: నిమజ్జనానికి తరలి వెళ్తున్న ఐనముక్కల విగ్రహం

దొనకొండ (కురిచేడు): దొనకొండ పరిధిలోని వైఎస్సార్, ఎన్‌టీఆర్ కాలనీలు, స్థానిక అరబస్తాన్, ఇండ్లచెరువు, వెంకటాపురం గ్రామాల్లో గణనాథులను శనివారం ఉల్లాసంగా నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువకులు ఉత్సాహంతో గులాంలు చల్లుకుంటూ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు గణనాథులకు పూజలు చేసి నిమజ్జనానికి తరలిస్తున్నారు. భజంత్రీలతో యువకులు గులాంలు చల్లుకుంటూ పాటలు పాడుకుంటూ చందవరం సాగర్ కాలువ వద్దకు నిమజ్జనానికి తరలించారు.

కురిచేడులో..

గణేష్ విగ్రహాల నిమజ్జనం యువకులు ఘనంగా నిర్వహించారు. వినాయకునికి మూడు రోజుల ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు, అన్నదానం చేశారు. నిమజ్జనం సందర్భంగా డీజే బాక్స్‌లతో గణనాథులను తరలించారు. యువతీ, యువకులు కేరింతలు కొడుతూ వినాయకుడిని శోభాయమానంగా సాగించారు. శ్రీనివాసనగర్, నుసుంబజార్‌లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల ముందు యువకులు, మహిళలు నృత్యం చేస్తూ నాగార్జున సాగర్ కాలువలో నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులు నిమజ్జనానినికి తరలి వెళ్లాయి. వివిధ ప్రాంతాల్లో ఆది దేవునికి తమ విఘ్నాలు తొలగి శుభాలు చేకూరాలంటూ భక్తులు మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల, వెచ్చా వెంకట సుబ్బయ్య వీధి, ఐనముక్కల తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి నిమజ్జనానికి శ్రీశైలం తరలించారు. భక్తులు ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను ఉంచి ఊరేగించారు.

హెచ్ఐవీ వ్యాప్తి చెందకుండా చూడాలి



హెచ్ఐవీపై అవగాహన కల్పించే వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రో ఆర్గనైజేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ పీరు బాషా సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ, కజిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో శనివారం ఒంగోలు నగరంలోని అన్నవరప్పాడులో గల ఒక ప్రైవేటు స్కూలులో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీరు బాషా మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా ఔషధాలు తీసుకోవాలని, వాటితోపాటు మంచి పోషకాహారం తినాలని చెప్పారు. పోషకాహార లోపంతో అనేక సమస్యలు వస్తాయని, ఆరోగ్యం త్వరగా క్షీణిస్తుందని అన్నారు. సానుకూల దృక్పథంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, క్షయ, సుఖవ్యాధుల గురించి సమగ్రంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ బీవీఆర్ శాస్త్రి, ఉపాధ్యాయుడు లింగయ్య, గ్రో ఆర్గనైజేషన్ సిబ్బంది మద్దిరాల వెంకట్రావు పాల్గొన్నారు. తొలుత ఎయిడ్స్‌పై అవగాహన కల్పించే పోస్టర్లు ఆవిష్కరించారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కొండపి: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి.గోపీనాథ్ అధ్యక్షతన మండలంలోని వీఓఏలకు, వలంటరీ టీచర్లకు ఉల్లాస్ – అక్షరాంధ్ర కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఉల్లాస్ – అక్షరాంధ్ర కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరికీ సామాజిక విషయాలైన ఆరోగ్యం, పరిశుభ్రత, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. రెండో విడత ఎంపిక చేసినటువంటి గ్రామాలైన అనకర్లపూడి, నెన్నూరుపాడు, పెద్ద కండ్లగుంట, పెట్లూరు, కె.ఉప్పలపాడు గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఎంఈఓ సురేఖ మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రైమరీ స్కూళ్లలో నిర్వహించుకోవాలని సూచించారు. అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ సారెడ్డి మాట్లాడుతూ వయోజనులకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఏపీఎం గోపీనాథ్ సంస్థాగత నిర్మాణం, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి రుణాలు, జీవనోపాధులు మొదలగు విభాగాలపై సమీక్షించి లక్ష్యాలు నిర్దేశించారు. సూపర్‌వైజర్ విక్టోరియా రాణి మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించడంలో అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీఎంజీ మాధవరావు, సీసీలు డి.మల్లికార్జునరావు, వి.కృష్ణారెడ్డి, సీహెచ్ గోవిందమ్మ, కె.రామాంజనేయులు, కేవీ రమణమ్మ, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఆనందరావు

టంగుటూరు: మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు చేయాలని ఎంఈఓ ఆనందరావు అన్నారు. తూర్పు నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి అధ్యక్షతన శనివారం క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా క్లస్టర్ నోడల్ అధికారి, మండల విద్యాశాఖ అధికారి ఆనందరావు హాజరయ్యారు. క్లస్టర్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వల్లూరు కారుమంచి, క్లస్టర్ పరిధిలోని 10 మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, ఆన్‌లైన్‌లో విద్యార్థుల హాజరు, వారి మార్కులు నమోదు చేయాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రంగా ఉంచాలని, మధ్యాహ్నం భోజనం సక్రమంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు నూరు శాతం హాజరయ్యేటట్లు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎంలు రమణారెడ్డి శ్రీనివాసరావు, సీఆర్‌పీ డి.శ్రీనివాసులు, సిబ్బంది పి.సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావిచెట్టు తొలగింపు.. వీహెచ్‌పీ ఆందోళన

ఒంగోలు సబర్బన్: నగరంలోని మంగమూరు రోడ్డులో లాయర్‌పేట సాయిబాబా గుడి పక్కన గాయత్రి మందిరం వద్ద రోడ్డు మధ్యలో ఉన్న రావి చెట్టును ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు శనివారం తొలగించారు. దాంతో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), హిందూ దార్మిక సంస్థలు, బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. లాయర్‌పేట రైతు బజారు నుంచి మంగమూరు రోడ్డు జంక్షన్ వరకు రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేసేందుకు మున్సిపల్ అధికారులు పనులు చేపట్టారు. ఈ రోడ్డులో అడ్డంగా ఉండటంతో పెద్ద రావి చెట్టును పెకళించి పక్కనే ఉన్న గాంధీ పార్కులో యథావిధిగా స్థాపించారు. ఏళ్ల తరబడి భక్తులు ఆ రావి చెట్టుకు మొక్కులు తీర్చుకుంటూ, ప్రదక్షిణలు చేస్తూ భక్తిభావంతో పూజలు చేస్తున్నారు. అర్ధంతరంగా దాన్ని తొలగించటం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని వీహెచ్‌పీ నాయకులు, సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సంఘటన స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు చెట్టు తొలగించారని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పక్కనే ఉన్న గాంధీ పార్కులో ప్రతిష్ఠించామని, ఆ చెట్టుకు సంప్రోక్షణ చేస్తున్నామని, వేద పండితులతో హోమం కూడా చేయిస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎక్కువ మంది పాల్గొని పూజలు చేసుకునే విధంగా గాంధీ పార్కులో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై తక్షణం స్పందించండి

కనిగిరిరూరల్: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య సమస్యలపై తక్షణం స్పందించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 5,7,8వ వార్డుల్లో శనివారం చైర్మన్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు వార్డుల్లో అధ్వాన్న పారిశుధ్యం, మురికినీటి కాలువల పరిశుభ్రత తదితర సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చే పారిశుధ్య సమస్యపై, ఫిర్యాదులపై సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి, తక్షణ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన, చైతన్యం కల్గించాలన్నారు. వాతవరణ మార్పులు, నీటి నిల్వలు, పారిశుధ్యం వల్ల రోగాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కేవీలో ఇన్వెస్టీచర్ సెర్మనీ వేడుకలు



విద్యార్థి సంఘు నాయకులతో ఎంఈఓ

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి కేంద్రియ విద్యాలయంలో ప్రిన్సిపాల్ కర్తార్‌సింగ్ గుర్జార్ ఆధ్వర్యంలో ఇన్వెస్టీచర్ సెర్మనీ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ ప్రగఢ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థి సంఘం నాయకులు తోటి విద్యార్థులతో సమన్వయంతో మమేకమై అందరి మన్ననలు పొందాలని చెప్పారు. విద్యార్థి సంఘు నాయకులు స్కూల్ కెప్టెన్‌గా వై.ముఖేష్‌రెడ్డి, మౌనిక, వైస్ కెప్టెన్‌గా ఎం.హర్షిత, స్పోర్ట్స్ కెప్టెన్‌గా వి.గణేష్‌రెడ్డి, యసస్వీ, వైస్ కెప్టెన్‌గా డి.శివారెడ్డి, చిన్మయిలను ఎన్నుకున్నారు. ఎంఈఓ ఎంపికైన విద్యార్థులకు బ్యాడ్జిలు తొడిగి సన్మానించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరలకే నిత్యావసరాలు విక్రయించాలి



డీలర్లతో మాట్లాడుతున్న డీటీ ఫణి

తాళ్లూరు: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నిత్యావసరాలు విక్రయించాలని డిప్యూటీ తహసీల్దార్ ఫణి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ ఉదయం 7 గంటల నుంచే రేషన్ దుకాణాల వద్ద ప్రజలకు అందుబాటులో ఉంటూ వృద్ధులు, వికలాంగులకు వీలైనంత త్వరగా రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ సూచించారు. వీఆర్వో పి.చంద్రశేఖర్‌రావు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్‌రావు

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరంలో పలు ఎరువుల దుకాణాలను ఏవో ప్రసాద్‌రావు పోలీసులతో కలిసి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత రికార్డులు పరిశీలించారు. నిల్వ ఉంచిన ఎరువుల వివరాలను రోజూ నమోదు చేయాలని చెప్పారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సూచించారు. ఏవోతో పాటు కానిస్టేబుళ్లు రాము, మాలకొండయ్య ఉన్నారు.

బర్లీ పొగాకు కొనుగోలు చేయాలి

- కొనుగోలు చేసిన పొగాకు డబ్బును రైతుల ఖాతాలకు వెంటనే జమ చేయాలి
- సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాను విజయవంతం చేయాలని రైతు నాయకుల పిలుపు



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘు నాయకులు

నాగులుప్పలపాడు రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకును రాష్ట్ర ప్రభుత్వం చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని ప్రకటించిన విధంగా వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘు జిల్లా, మండల అధ్యక్షులు జె.జయంతిబాబు, టి.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఈదుమూడి, ముప్పాళ్ల, తిమ్మసముద్రం, ఒమ్మెవరం, కండ్లగుంట, నాగులుప్పలపాడు, పోతవరం తదితర గ్రామాల్లో బర్లీ పొగాకు రైతులతో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. ఈ ఏడాది ప్రైవేట్ కంపెనీలు బర్లీ పొగాకు ఎంత ఉన్నా కొనుగోలు చేస్తామని రైతులను ప్రోత్సహించి అధికంగా సాగుచేయించాయని తెలిపారు. తీరా పంట చేతికొచ్చిన తరువాత కొన్ని కంపెనీలు కొనుగోలు చేయకుండా చేతులెత్తివేయడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులంతా రైతు సంఘాలను సంప్రదించాయన్నారు. దాంతో ఆయా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయించి బర్లీ పొగాకు పూర్తిగా కొనుగోలు చేయాలని పలు దఫాలుగా ఉద్యమించారన్నారు. దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి రెండు నెలల నుంచి కొనుగోలు ప్రారంభించినప్పటికీ సగం మంది రైతుల వద్ద కూడా కొనుగోలు చేయకపోవడంతో వారంతా అమ్ముకోలేక.. నిల్వ చేయడానికి వసతులు లేక పలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేసినప్పటికీ ఎకరానికి రూ.50 వేల మేరకు నష్టం వస్తోందని, అసలు కొనకపోతే పూర్తిగా నష్టపోతామని, చేసిన అప్పులు తీర్చలేక రైతుల ఆత్మహత్యకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం కూలీలకు కూడా డబ్బులివ్వలేని పరిస్థితి రైతులకు నెలకొందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చివరి ఆకు వరకు బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బు జమచేయాలని కోరుతూ సోమవారం ఒంగోలులో కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని బర్లీ పొగాకు రైతులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల పుస్తకావిష్కరణ



ఉపాధ్యాయుడు కోటేశ్వరరావును సన్మానిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

కొత్తపట్నం: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సీహెచ్ కోటేశ్వరరావు స్వాతంత్య్ర సమరయోధుల పుస్తకంతో పాటు తెలుగు భాషపై ఒకటో తరగతి వర్ణమాల గేయామృతం పుస్తకాన్ని ముద్రించి శనివారం ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. తన సొంత నగదు వెచ్చించి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సిబ్బంది, కళా మిత్ర, ప్రకాశం జిల్లా రచయితల సమైక్య వారు కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, కళామిత్ర అంకమ్మరావు, పేలారున, ఎమ్మెస్ ప్రసాద్, సన్నపనేని రవి పాల్గొని అభినందించారు.